
సాక్షి నిర్మల్

బుధవారం । 15 । మార్చి । 2023



'భట్టి' యాత్ర.. బలపడే ఆశ..!
అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈ నెల 16 నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర చేయనున్నారు. ఈమేరకు రూట్ మ్యాప్ తయారైంది. 10లో▸

మేలుకో.. తెలుసుకో..
కొన్న వస్తువు నాణ్యతలోపంతో ఉన్నట్లయితే న్యాయపోరాటం చేయడమే మన కున్న ఏకైక మార్గం. ఇది మన హక్కు కూడా.



నేడు వినియోగదారుల హక్కుల దినం. 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.2/21.0
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ప్రశ్నపత్రం లీకేజీపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలి

నిర్మల్: టీఎస్‌పీఎస్సీ పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని, ఉద్యోగ పరీక్షల ప్రశ్నపత్రం లీకేజీపై ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం నిర్మల్ అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఉద్యోగాలు వస్తే తమ జీవితాలు మారిపోతాయన్న ఆశతో ఉన్న నిరుద్యోగుల జీవితాలను నాశనం చేసేలా టీఎస్‌పీఎస్సీ తయారైందని ఆరోపించారు. ప్రశ్న పత్రాలు లీక్‌చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

'డబుల్ బెడ్రూం'లకు డబ్బులు ఇవ్వొద్దు

భైంసాటౌన్:డబుల్ బెడ్రూంలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. భైంసా పట్టణంలో డబుల్‌బెడ్రూం ఇళ్లకు వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు విచారణ చేపడుతున్నారని, అర్హులకు మాత్రమే ఇళ్లు కేటాయిస్తామన్నారు. ఎవరికైనా డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. అలాగే ఇసుక రవాణా కోసం రెవెన్యూ అధికారుల అనుమతి పొందాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఖాతా పేరిట ట్రాక్టర్‌కు రూ.801 చెల్లించి అనుమతి పత్రం పొందాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆలయ భూముల సర్వే



సర్వే చేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

ముథోల్: మండలంలోని తరోడ గ్రామంలో హనుమాన్ దేవాలయానికి సంబంధించి సర్వే నంబరు 73లో ఉన్న 22 గుంటల భూమి కోసం దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ జోన్ దేవాదాయశాఖ సర్వేయర్ అనిల్, సిబ్బంది సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఆలయ భూమిని ఆక్రమించుకున్న 15 మందిని గుర్తించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామని దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ తెలిపారు. సర్వే సందర్భంగా గొడవలు జరుగకుండా ఏఎస్సై సుదర్శన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అభిమన్యు, సర్పంచ్ శ్వేత, జెడ్పీటీసీ గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



బండి సంజయ్‌ను కలిసిన పడాల రాజశేఖర్


ఖానాపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఖానాపూర్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీరాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఖా నాపూర్ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా సంజయ్ పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల పక్షాన పోరాడడంతోపాటు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారని రాజశేఖర్ తెలిపారు.

రెగ్యులర్ డీపీవోగా శ్రీలత



మంత్రిని కలిసిన డీపీవో శ్రీలత

నిర్మల్‌చైన్‌గేట్:ప్రస్తుతం ఇన్‌చార్జి డీపీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీలతను పూర్తిస్థాయి డీపీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతేడాది మే 24న శ్రీలత ఇన్‌చార్జి డీపీవోగా బాధ్యతలు స్వీకరించారు. పూర్తిస్థాయి డీపీవోగా నియామకం కావడంతో మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



బాలికల జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

విజయీభవ..

- నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు
- హాజరుకానున్న 15,201 మంది విద్యార్థులు
- జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు,
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం నిబంధన అమలు

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. మొదటి రోజు ఫస్ట్ ఇయర్, గురువారం సెకండియర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. దీనికోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈసారి కూడా ప్రభుత్వం నిమిషం నిబంధన అమలు చేస్తుంది. పరీక్ష సమయానికి నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించరు. ఉదయం 8:30 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. సీసీ కెమెరాల నీడలో ప్రశ్నపత్రాల కవర్లను తెరుస్తారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు...
ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం డీఐఈవోతోపాటు ఒక సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్‌తో జిల్లా పరీక్షల కమిటీని నియమించారు. కస్టోడియన్ అధికారులుగా నిర్మల్‌కు ఇద్దరిని, భైంసాకు ఒకరిని నియమించారు. ఒక అధ్యాపకుడు, తహసీల్దార్, ఏఎస్‌ఐ స్థాయి పోలీస్‌తో ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, ఇద్దరు సీనియర్ లెక్చరర్ల చొప్పున రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. 500 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల విధులు నిర్వహించనున్నారు.

ప్రత్యేక కంట్రోల్ రూమ్..
ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు 7997994358, 9441069470 నంబర్లు పనిచేస్తాయి. సమస్య ఉన్న విద్యార్థులుసంప్రదించవచ్చు.

23 పరీక్ష కేంద్రాలు..
ఇంటర్ పరీక్షల కోసం ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 23 పరీక్ష కేంద్రాలు నేర్పాటు చేశారు. ఇందులో 8 సెల్ఫ్ సెంటర్లు ఉన్నాయి. అన్ని పరీక్ష కేంద్రాల్లో జంబ్లింగ్ విధానంలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పరీక్షలకు 15,201 మంది విద్యార్థులు..
జిల్లాలో ఈ ఏడాది 15,201 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 7,540 ఉండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,661 ఉన్నారు. ఫస్ట్ ఇయర్‌లో జనరల్ విద్యార్థులు 6,207 ఉండగా, వొకేషనల్ విద్యార్థులు 1,333 మంది పరీక్షలు రా యనున్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 6,463 మంది, వొకేషనల్ విద్యార్థులు 1,198 మంది పరీక్షలు రాయనున్నారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్..
పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిరాక్స్ కేంద్రాల మూసివేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే విద్య, వైద్య, రవాణా, విద్యుత్, తపాలా, పోలీసు శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్షకు హాజరుకావొచ్చు. పరీక్ష కేంద్రాల్లో ప్రాథమచికిత్స కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం..



జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. దీనికోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాల సీల్ ఓపెన్ చేస్తాం.
– పరశురాం, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి

ప్రభుత్వ పథకాలు ప్రజలకు వరం



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్

- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు వరమని రాష్ట్ర దేవాదాయ, న్యాయ పర్యావరణ అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె.వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలోనే సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకాలతో సామాన్యుల ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగవుతున్నాయన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న పలు పనులు వేగంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి...
రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని ఆవాసాలకు మంచినీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పనుల్లో అలసత్వం వహించకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. నిధుల విషయంలో ఇబ్బందులు కలుగకుండా పైఅధికారులతో చర్చించి పనులు చేయాలని సూచించారు.

అంతర పంట సాగుకు రూ.4,200...
ఆయిల్‌పాం సాగు జిల్లాలో ఎక్కువగా విస్తరించేలా చూడాలని మంత్రి సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,550 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుచేస్తున్నట్లు తెలిపారు. మార్చి నెలాఖారులోగా మరో 150 ఎకరాల్లో సాగుచేయడం జరుగుతుందన్నారు. ఆయిల్‌పాం తోటల్లో అంతర పంటలుసాగు, ఎరువుల కోసం రైతులకు ఎకరాకు రూ.4,200 ఇవ్వడం జరుగుతుందన్నారు.

జనుము విత్తనాల పంపిణీ...
జనుము విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేసి ఆయిల్‌పాం మొక్కల చుట్టూ వేయించాలని సూచించారు. వేసవిలో వేడి గాలుల నుంచి మొక్కను కాపాడుతుందని, నీటి ఆవిరి శాతాన్ని తగ్గిస్తుందని తెలిపారు. సమావేశంలో నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు ఈశ్వర్, రాజేందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఆర్వో లోకేశ్, ఆర్డీవో స్రవంతి, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

ఖానాపూర్: ప్రభుత్వం లక్కీడ్రా పద్ధతిన కాకుండా అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నంది రామయ్య, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్హులతో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్‌లో లబ్ధిదారుల ఎంపిక విషయంలో మొదటి నుంచి చివరి వరకు అధికారులు పూర్తిగా తప్పుడు సర్వే చేశారన్నారు. తప్పుడు సర్వేల కారణంగా అర్హులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు వారికి ఉన్న విచక్షణ అధికారాలను వినియోగించి అనర్హులను తొలగించి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో అంబటి రవి, తదితరులు ఉన్నారు.

అభ్యంతరాల వెల్లువ..
మరోవైపు డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితాలో అనర్హులకు చోటు కల్పించారని స్థానిక ఎమ్మెల్యేతోపాటు ప్రతిపక్షాలు, బాధితులు ఆరోపించిన నేపథ్యంలో అధికారులు అనర్హుల ఏరివేతకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయంతోపాటు మున్సిపల్ కార్యాలయంలో అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక గ్రీవెన్స్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. పలువురు పేపర్లపై అభ్యంతరాలు రాసి ఈ బాక్స్‌ల్లో వేశారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు, బాధితులు

విధుల్లో చేరిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

నిర్మల్‌చైన్‌గేట్:నిర్మల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ జీవీడీఎస్. ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి సోమవారం రాత్రి జిల్లాకు చేరుకున్న ఆయనకు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి ఆర్ఎంవో డాక్టర్ వేణుగోపాలకృష్ణ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆఫీసు సూపరింటెండెంట్ రఘునాథ్, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, రేడియోగ్రాఫర్ అబు అమీర్, ఫార్మసిస్ట్ శ్రీనివాసచారి, స్టాఫ్ నర్స్ మాణిక్య వీణ తదితరులు ప్రిన్సిపాల్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ఆస్పత్రికి సంబంధించిన వివరాలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



ప్రిన్సిపాల్ కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న దేవేందర్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం



మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పక్కన కలెక్టర్

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

లక్ష్మణచాంద:తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోన్ మండలం మాదాపూర్‌లో రూ.1.10 కోట్లతో నిర్మించే విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అన్ని రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. అతి త్వరలోనే మాదాపూర్‌కు ఆయిల్‌పాం ప్యాక్టరీ రాబోతుందని పేర్కొన్నారు. రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ఆయిల్‌పాం సాగుకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. కార్యక్రమంలో సోన్ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, సర్పంచ్ రాజనరసింహారెడ్డి, ఎంపీటీసీ సుమలత, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోయినొద్దీన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, ఆర్డీవో స్రవంతి, తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో ఉషారాణి పాల్గొన్నారు.

1,100 మందికి 'దళితబంధు'
నిర్మల్‌చైన్‌గేట్:నిర్మల్ నియోజకవర్గంలో ఈ ఏడాది 1,100 మందికి దళితబంధు పథకం వర్తింపజేస్తామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. నిర్మల్ పట్టణం 36వ వార్డు బుధవార్‌పేట్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ సంఘ భవనానికి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌కు సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తుందన్నారు. ఏప్రిల్ 14న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజి రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యామ్ సుందర్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌యాదవ్, కౌన్సిలర్ పోశెట్టి పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో జిల్లాకు సీఎం కేసీఆర్!

- ముస్తాబవుతున్న కొత్త కలెక్టరేట్
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న పార్టీ ఆఫీస్
- కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- మొదటి వారంలో కార్యక్రమానికి సన్నాహం

నిర్మల్: ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలో జిల్లాకు రానున్నారు. వచ్చేనెల మొదటివారంలో జిల్లాకేంద్రంలో పలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందులో ఒకటి ఏళ్లుగా నిర్మాణం కొనసాగిన సమీకృత కలెక్టరేట్, రెండోది ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తిచేసుకుని ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్. వీటితోపాటు మెడికల్ కళాశాల భవనానికి శంకుస్థాపన, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభం, 2 వేల మందికి డబుల్‌బెడ్రూం ఇళ్లు అందజేస్తారు. నాలుగైదు కార్యక్రమాలతో సీఎం పర్యటన ఉన్నందున ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఎట్టకేలకు కలెక్టరేట్..
కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయంతోపాటు దాదాపు 38 శాఖల కార్యాలయాలన్నీ కలిపి ఒకే చోట అందుబాటులో ఉంచేందుకే రాష్ట్ర ప్రభుత్వం సమీకృత భవనాల నిర్మాణం చేపట్టింది. జిల్లా కేంద్రంలో మొదట్లో భీమన్నగుట్టను ఎంపిక చేశారు. దానిపై ప్రతిపక్షాలు, పలు సంఘాల వ్యతిరేకతలు, ఆందోళనలతోపాటు రాష్ట్ర అధికారులూ ఒప్పుకోకపోవడంతో అక్కడి నుంచి తరలించారు. అనంతరం కొచ్చెరువు పక్కన, ఖజానా చెరువు పైభాగంలో 25 ఎకరాలు కేటాయించారు. కొచ్చెరువు ఎఫ్‌టీఎల్‌లో కడుతున్నారంటూ కోర్టుకు వెళ్లడంతో 25 ఎకరాలు కాస్త 15 ఎకరాలైంది. అక్కడే ఐదేళ్లపాటు నిర్మాణం కొనసాగించి ఎట్టకేలకు ముగింపు దశకు చేర్చారు. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు.



ప్రారంభానికి సిద్ధమవుతున్న సమీకృత కలెక్టరేట్

బీఆర్ఎస్ ఆఫీస్..
తెలంగాణ భవన్‌గా పిలుచుకునే బీఆర్ఎస్ ఆఫీస్‌లను జిల్లాల్లోనూ ప్రారంభించాలని నిర్మల్‌లోనూ పార్టీ ఆఫీస్ కట్టారు. జిల్లాకేంద్రం శివారులోని కొండాపూర్‌లో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు కావస్తోంది. భవన నిర్మాణ సమయంలోనూ ఇక్కడి స్థలంపై కొంత ఆందోళన కొనసాగింది. కార్యాలయ నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి సీఎం సమయం ఇవ్వకపోవడంతో ఏళ్లుగా అలా.. ఖాళీగానే ఉండిపోయింది. తాజాగా సమీకృత కలెక్టరేట్‌లతోపాటు బీఆర్ఎస్ కార్యాలయాలనూ కేసీఆర్ ప్రారంభిస్తున్నారు. ఇదే తీరులో ఇక్కడా వచ్చేనెల మొదటివారంలో ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఇళ్లు.. స్కూళ్లు..
సమీకృత కలెక్టరేట్, బీఆర్ఎస్ ఆఫీస్ ప్రారంభోత్సవాలతోపాటు చించోలి(బి) శివారులో వందలాది విద్యార్థులు చదివే మైనార్టీ గురుకుల భవన సముదాయాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అలాగే నిర్మాణాలు పూర్తయి, లబ్ధిదారులుగా ఎంపికచేసిన వారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు పంపిణీ చేస్తారు. దాదాపు రెండువేల మంది లబ్ధిదారులకు ఇళ్లు అందించనున్నట్లు మంత్రి ఐకేరెడ్డి తెలిపారు.

ఏర్పాట్లు షురూ..
జిల్లాలో సీఎం పర్యటన ఏప్రిల్ మొదటి వారంలో ఉండనుంది. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కొత్త కలెక్టరేట్‌ను పరిశీలించారు. మెరుగులద్దే కార్యక్రమాలతోపాటు గార్డెనింగ్ సకాలంలో పూర్తిచేయాలని చెప్పారు. కాగా, సీఎం కేసీఆర్ పర్యటన తేదీ ఖరారు కావాల్సి ఉంది.

మిగతా పనులూ పూర్తిచేస్తాం..
సమీకృత కలెక్టరేట్‌కు సంబంధించిన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం ముగింపుదశ కొనసాగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోపు అన్ని పనులు పూర్తిచేస్తాం.
– అశోక్, ఈఈ, ఆర్అండ్‌బీ

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ ఏడాది జిల్లాలో 9,078 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. 48 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాట చేయాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతీ కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో పరీక్ష ప్రశ్న పత్రాల నిల్వకు పోలీస్ స్టేషన్లలో తగిన ఏర్పాట్లు చేయాలని, పటిష్ట బందోబస్తు చేపట్టాలని ఆదేశించారు. పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ సజావుగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలపై ఓరియంటేషన్
నిర్మల్ రూరల్: పదో తరగతి పరీక్షల నిర్వహణపై డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత సంవత్సరం పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని, ఫలితాల్లో రాష్ట్రంలో రెండోస్థానం సాధించామన్నారు. ప్రశ్న పత్రాలను సీసీ కెమెరాల సమక్షంలో ఓపెన్ చేయాలని సూచించారు. పరీక్ష అనంతరం ప్యాకింగ్ కూడా జాగ్రత్తగా చేసి, పోస్ట్ ఆఫీస్‌లో పోస్ట్ చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సీటింగ్, ఫర్నిచర్, తాగు నీరు, విద్యుత్ వసతి, ఫ్యాన్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. పరీక్ష సిబ్బంది, ఇన్విజిలేటర్లు అవకతవకలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈసారి ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయని, సైన్స్ పేపర్ రోజు భౌతిక రసాయన శాస్త్రం, జీవ శాస్త్రం పరీక్షలు ఉంటాయని వివరించారు. జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మ మాట్లాడుతూ జిల్లాలో ఈఏడాది 9,078 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరి కోసం 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 48 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 48 మంది డిపార్టుమెంటల్ అధికారులు, ఏడుగురు కస్టోడియన్లను నియమించామని తెలిపారు.



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

క్లుప్తంగా

యువతి అదృశ్యం


సీరం సుజాత (ఫైల్)

భైంసారూరల్(ముధోల్): మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన సీరం సుజాత అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన సుజాత ఈ నెల 12న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం యువతి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగులమందు తాగి ఒకరు ఆత్మహత్య

ఖానాపూర్: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మేడంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై ఆర్.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మేడంపల్లి గ్రామానికి చెందిన కోల జలపతి (55) తరచూ మద్యం సేవించి చనిపోతానని ఇంట్లో కుటుంబ సభ్యులను బెదిరించేవాడు. మంగళవారం సైతం ఉదయం పొలానికి వెళ్లి గుర్తుతెలియని పురుగుల మందుతాగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో వాంతులు చేసుకోవడంతో గమనించిన అతని భార్య లక్ష్మి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

బేల(ఆదిలాబాద్): మండలంలోని కోగ్దూర్ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. నాలుగు ట్రాక్టర్లను అడ్డుకుని స్థానిక ఆలయాల ప్రాంగణాలకు తరలించారు. ట్రాక్టర్ల టైర్లలో గాలి తీసేసారు. అధికారులు వచ్చేదాకా ట్రాక్టర్లు వదిలేది లేదని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ గీత గ్రామానికి వెళ్లి ట్రాక్టర్లకు జరిమానా వేస్తామని, సదరు యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పినా శాంతించలేదు. సాయంత్రం ఎస్సై కృష్ణకుమార్ వెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగు చర్యలు తీసుకుంటానని ఎస్సై హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్


మాట్లాడుతున్న కాంతిలాల్ పాటిల్

భైంసాటౌన్:ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీ వంటి వివరాలు తెలుపొద్దని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. పట్టణంలోని రాహుల్‌నగర్‌లో మంగళవారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 52 బైక్‌లు, మూడు కార్లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీ వాసులతో నిర్వహించిన సమావేశంలో ఏఎస్పీ మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే అపరిచిత మెసేజ్, కాల్స్‌కు స్పందించొద్దని తెలిపారు. సీఐ ఎల్.శ్రీను మాట్లాడుతూ.. కాలనీవాసులు కమిటీగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానితులు కనిపించినా, పోలీసుల సహాయం అవసరమైనా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు


కవాతు నిర్వహిస్తున్న ఆర్ఏఎఫ్ పోలీసులు

నిర్మల్: జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీధుల గుండా సాగింది. హకీంపేటకు చెందిన 99 ఆర్ఏఎఫ్ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ శ్రీకాంత్, 75మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మేలుకో.. తెలుసుకో..



పాతమంచిర్యాల: మార్కెట్‌లో మనం కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు తప్పనిసరిగా రశీదు పొందాలి. ఆ రశీదును భద్రపరుచుకోవాలి. ఎందుకంటే ఆ చిన్న రశీదుకు మీ హక్కులను రక్షించే శక్తి ఉంది. అందుకే ఏదైన వస్తువు కొన్నప్పుడు దాని రశీదును జాగ్రత్తగా కాపాడుకోవాలి. కొన్న వస్తువులు నకిలీవి అని తెలిసినప్పుడు మన వద్ద రశీదు లేకుంటే మనం ఏమీ చేయలేని పరిస్థితి. కొన్న వస్తువు నాణ్యతలోపంతో ఉన్నట్లయితే న్యాయ పోరాటం చేయడమే మనకున్న ఏకైక మార్గం. ఇది మన హక్కు కూడా. ఈ న్యాయపోరాటంలో వినియోగదారుడు ఉత్పత్తిదారుడి నుంచి పరిహారం పొందే వీలుంటుంది. దానికంటేముందు కొనే వస్తువు సేవల్లో నాణ్యత, స్వచ్ఛత ఉండాలనే విషయం వినియోగదారులు ముందుగా తెలుసుకోవాలి. వస్తువు ఉపయోగించడానికి తగ్గట్లుగా లేకున్నా.. ప్రాణ, ఆస్తి నష్టం కలిగించేలా ఉన్నా ఆ వస్తువులు అమ్మినవారిపై ఫిర్యాదు చేసి తమ హక్కును కాపాడుకోవడమే వినియోగదారుల హక్కుల్లో ఉండే మొదటి అంశం.

- వస్తు సేవల్లో మోసాలపై జాగ్రత్త
- ప్రతీ కొనుగోలుకు రశీదు తప్పనిసరి
- లేదంటే నష్టపోవాల్సిన పరిస్థితి
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

వినియోగదారుల రక్షణ చట్టం-2020

వినియోగదారుల రక్షణ చట్టాన్ని 1986లో భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా అది 1987 డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. చట్టం అమలులో ఉన్నప్పుడు మార్కెట్ పరిధి చాలా తక్కువ. ఆ సమయంలో సూపర్ మార్కెట్లు, ఈ కామర్స్ వంటివి లేవు. ఇప్పుడున్నట్లు ఇతర దేశాలతో వస్తువుల ఎగుమతి, దిగుమతులు ఉండేవి కావు. దీంతో పాత చట్టాల ప్రకారం ఫిర్యాదులు చేయడం సమస్యగా మారడంతో భారత ప్రభుత్వం 2020లో కొత్తచట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ చట్టంలో ప్రస్తుత మార్కెట్ విధానాలకు తగ్గట్లుగా పలు అంశాలు చేర్చారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఫిర్యాదులను 48గంటల్లో స్వీకరించి వాటిని నెల రోజుల్లో పరిష్కరించేలా సూచనలు చేశారు. వీలైతే ఫాస్ట్‌ట్రాక్ ప్రాతిపదికన ఫిర్యాదులు పరిష్కరించే కీలక సంస్కరణలు చేశారు. వస్తువులు ఉత్పత్తి చేసే కంపెనీలు వాటిపై జవాబుదారీ తనం ఉండేలా చట్టంలో జోడించారు. వస్తువులు కొన్నచోటనే కాకుండా ఎక్కడైనా కేసు వేసే అవకాశం కల్పించారు. వినియోగదారులకు ఉండే హక్కులు వాటిని పరిష్కరించుకునే మార్గాలను స్పష్టంగా పేర్కొన్నారు.

ఇదీ.. చారిత్రక నేపథ్యం..

1962 మార్చి 15న అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ దేశ పౌరుల కోసం ప్రప్రథమంగా వినియోగదారుల హక్కులు ప్రకటించారు. అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకులు మార్చి 15ను ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దీంతో 1973 నుంచి ప్రపంచ దేశాలు దీన్ని పాటించడం ప్రారంభించాయి. మన దేశంలో 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రసాదించింది.

ఇందులో వినియోగదారులకు రక్షణహక్కు, సమాచార హక్కు, వస్తు సేవలందుకునే హక్కు, ప్రాతినిధ్య హక్కు, విజ్ఞాపన హక్కు, వినియోగదారుల విద్యా హక్కు, స్వచ్ఛమైన పర్యావరణ హక్కు ఉన్నాయి.

- **వినియోగదారుల రక్షణ హక్కు:** మానవ ప్రాణాలు, ఆస్తికి ప్రమాదకర వస్తువుల వలన రక్షణ పొందే హక్కు.
- **సమాచారం పొందే హక్కు:** అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడానికి, వస్తువుల నాణ్యత బరువు స్వచ్ఛత గురించి తెలిపే హక్కు.
- **వస్తువులు, సేవల ఎంపిక హక్కు:** వివిధ రకాల వస్తువుల కొనుగోలు, ఆ వస్తువుల సేవలు పొందడానికి వాటి రేటు నాణ్యత తెలుసుకోవడం, నాణ్యమైన సేవలు పొందడం.
- **ప్రాతినిధ్యం వహించే హక్కు:** వినియోగదారుల హక్కులు, ఆసక్తిని వారి అవసరాలను సరైన వేదికలో ఫోరంలో వినిపించడం, వినియోగదారుల సంక్షేమార్థం వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం.
- **వస్తు, సేవ లోపాల నుంచి పరిహారం పొందే హక్కు:** వినియోగదారులు మోసాలకు గురైనప్పుడు ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా పరిహారం పొందడం.
- **వినియోగదారుల విద్యాహక్కు:** వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ తమ జ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవడం.
- **స్వచ్ఛమైన పర్యావరణ హక్కు:** పర్యావరణానికి ఎలాంటి కీడు జరగకుండా వస్తువులు, సేవలు పొందడం వినియోగదారుల హక్కు.

సమస్యల పరిష్కార వేదికలు

వినియోగదారులకు తక్కువఖర్చుతో త్వరగా వివాదాలు పరిష్కరించడానికి ప్రభుత్వం వివిధ రకాల పరిష్కార వేదికలు ఏర్పాటు చేసింది. జాతీయ, రాష్ట్ర వినియోగదారుల పరిష్కార సంఘాలతో పాటు జిల్లాలో వినియోగదారుల పరిష్కార వేదిక జిల్లా కోర్టును డిస్ట్రిక్ట్ ఫోరంగా వ్యవహరిస్తారు. ఈ వేదికలు క్వాసీ జ్యూడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి.

జిల్లా వ్యాప్తంగా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్సీ గంగాధర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. పది గ్రామాలకు ఒకటి, మున్సిపాలిటీలో నాలుగు వార్డులకు ఒకటి చొప్పున చేపడుతున్నామన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ గొడం నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన ప్రిన్సిపాల్


పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ జేవీడీఎస్ ప్రసాద్

నిర్మల్: నిర్మల్ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన జేవీడీఎస్ ప్రసాద్ మంగళవారం రాత్రి జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు వార్డులలో తిరిగారు. సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. రోగులను సేవల గురించి అడిగారు. వారంలో ఎన్ఎంసీ బృందం రెండోవిడత తనిఖీకి రానున్న నేపథ్యంలో ఆయన పరిశీలించినట్లు సిబ్బంది తెలిపారు.

సారా తయారుచేస్తే కఠినచర్యలు


కుంటాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ(బోథ్): నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ రాజమౌళి హెచ్చరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నేరడిగొండ మండలం పెద్దబుగ్గారం, కుంటాల, పీచర గ్రామాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. బుగ్గారంలో 60 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. రాథోడ్ కృష్ణ, పాలత్య వీణలపై కేసు నమోదు చేశారు. పీచర, కుంటాల గ్రామాల్లో నాటుసారా, గంజాయిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ.రాకేష్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ జి.లక్ష్మరావు, ఇచ్చోడ ఎక్సైజ్ ఎస్సై పి.రాజేశ్వర్, నేరడిగొండ పోలీసు సిబ్బంది రమాకాంత్, హెడ్‌కానిస్టేబుల్ గణేశ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'కడెం'ను ఆధునికీకరించాలి

- జల సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్దన్


మాట్లాడుతున్న నైనాల గోవర్దన్

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్టును ఆధునీకరించాలని తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్దన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రాథమిక సర్వే నిర్వహించారని, ఆతర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను రూపొందించినా ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టలేదన్నారు. కడెం ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఎగువన కుప్టి ప్రాజెక్ట్‌ను పూర్తిచేసి కడెం ప్రాజెక్ట్‌ను పది ఫీట్ల ఎత్తు పెంచాలని, అదనంగా మరో ఇరవై వరద గేట్లను ఏర్పాటు చేసి కడెం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నారు. శ్రీరాంసాగర్ కాకతీయ కాలువకు సమానంగా మరో కాలువ లేదా అంతర్గత పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు కొండేటి సత్యనారాయణ, చిన్నయ్య, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

బోథ్ డివిజన్ ఏర్పాటయ్యేనా?

- రెండు విడతల్లో దక్కని చోటు
- ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న ప్రజలు
- డివిజన్ ఏర్పాటు చేస్తే పాలన మరింత సులువు


బోథ్‌లోని తహసీల్దార్ కార్యాలయం

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ఆందోళనలు సైతం చేపట్టారు. కానీ ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడంలేదు. జిల్లాల పునర్విభజన తరువాత బోథ్‌ను డివిజన్ చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా కొత్త రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేసింది. గతంలో పరకాల, హుజూర్ నగర్, వేములవాడ, జోగిపేటలను రెవెన్యూ డివిజన్‌లుగా ఏర్పాటు చేసింది. కానీ అందులో బోథ్‌కు మాత్రం అవకాశం దక్కలేదు.

ప్రస్తుత జిల్లాలతో సమానంగా...

నియోజకవర్గ కేంద్రమైన బోథ్ ఒకప్పుడు తాలూకా కేంద్రంగా వెలుగొందింది. ప్రస్తుత జిల్లాలైన ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్‌లతో పాటు బోథ్ తాలుకాగా ఉండేది. నిజాం కాలం నాటి నుండే ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. బోథ్ తాలుకాలో నాలుగు మండలాలు, కిన్వట్, శివిని ప్రాంతాలు ఉండేవి. దీంతో జిల్లా కేంద్రాలతో పాటు సమానంగా కోర్టు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, డివిజన్ కార్యాలయాలతో పాటు ఇతర డివిజన్ కార్యాలయాలు ఉండేవి. ప్రస్తుతం ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలుగా ఉట్నూరు రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతున్నాయి. బోథ్ మాత్రం కేవలం మండలంగా మాత్రమే ఉంది. దీనికి తోడు ఇక్కడి కార్యాలయాలన్నీ ఇతర ప్రాంతాలకు తరలించారు.

డివిజన్‌గా ఏర్పాటు చేస్తే మరింత పాలన..

బోథ్ నియోజకవర్గంలో బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలు ఉన్నాయి. మొత్తం 9 మండలాల్లో బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాలను కలిపి డివిజన్ చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. దీంతో పాలన ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బోథ్ నియోజకవర్గంలోని 9 మండలాలు ఆదిలాబాద్ డివిజన్‌లో ఉన్నాయి. బోథ్ మారుమూల గ్రామాల నుండి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే కనీసం 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. జిల్లా కేంద్రానికి వెళ్లిన తరువాత అధికారులు అందుబాటులో లేకపోతే మళ్లీ రావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో దూరభారంతో పాటు ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పాలన సౌకర్యం ఏర్పడుతుందని మేధావులు పేర్కొంటున్నారు.

ఇబ్బందులు తొలగుతాయి



బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు పాలనా పరమైన ఇబ్బందులు తొలగిపోతాయి. ప్రస్తుతం రెవెన్యూ, ఇతరత్రా పనుల కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. నాలుగు లేదా ఐదు మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– అల్లం సాయికృష్ణ, బోథ్

ప్రజల ఆకాంక్షను గుర్తించాలి



బోథ్‌ను డివిజన్ చేయాలని కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఇతర జిల్లాల్లో రెండు విడతలుగా నాలుగు కొత్త రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేశారు. బోథ్‌ను డివిజన్ చేసేందుకు అన్ని అర్హతలున్నాయి. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించాలి.– గట్ల గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు

అభివృద్ధికి ఆస్కారం..

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందే ఆస్కారం ఉంది. వివిధ శాఖలకు చెందిన డివిజన్ కార్యాలయాలు బోథ్‌లోనే ఏర్పాటవుతాయి.

అర్ధరాత్రి కంటైనర్ హైజాక్

- నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఘటన
- రూ.4 లక్షల విలువైన వస్తువులు మాయం
- ఘటనపై పలు అనుమానాలు


కంటైనర్ డ్రైవర్ నుంచి వివరాలు సేకరిస్తున్న బాల్కొండ ఎస్సై

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సరిహద్దు ప్రాంతంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కంటైనర్‌ను హైజాక్ చేసిన సంఘటన సంచలనం సృష్టించింది. నాగ్‌పూర్ నుంచి హల్దీరాంలోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్‌ను కారులో వచ్చిన కొంత మంది దుండగులు అడ్డుకున్నారు. డ్రైవర్‌ను కారులో ఎక్కించుకున్న దుండగులు కంటైనర్‌ను వెంట తీసుకుని వెళ్లారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ జాతీయరహదారి పక్కన డ్రైవర్‌తో పాటు కంటైనర్‌ను వదిలి వెళ్లారు. డ్రైవర్ ప్రఫుల్ ఆనంద్‌రావు మంగళవారం ఉదయం బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కంటైనర్ హైజాక్‌కు గురైందని ఫిర్యాదు చేశారు. కానీ అందులో ఉన్న వస్తువులు ఎక్కడ ఖాళీ చేశారన్న విషయం తనకు తెలియదని, తనను దుండగులు కారులో బంధించి ఉంచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందులో ఉన్న రూ.4 లక్షల విలువైన వస్తువులు అర్ధరాత్రి రెండు గంటల వ్యవధిలో ఎక్కడ దాచారని పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతేకాకుండా కంటైనర్‌లో ఉన్న కొంత సరుకును నేరడిగొండ మండల కేంద్రంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ముందస్తు ప్లాన్ ప్రకారమే అంతాకలిసి హైజాక్ కథ నడిపించారన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇచ్చోడ సీఐ నైలు నాయక్‌ను వివరణ కోరగా హైజాక్‌కు గురైన కంటైనర్‌ను దుండగులు బాల్కొండ వద్ద వదిలివెళ్లినట్లు తెలిపారు. కంటైనర్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు.



ప్రమాదకర ప్రయాణం

ద్విచక్ర వాహనంపై ఒక్కరు లేదా ఇద్దరు మాత్రమే ప్రయాణించాలన్నది నిబంధన. కానీ ఇలా టీవీఎస్ మోపెడ్‌పై ఏకంగా ఐదుగురు ప్రమాదకరంగా ఇలా ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం పట్టు తప్పినా ప్రాణాలు గాలిలో కలిసిపోయే ఆస్కారమున్న ఈ దృశ్యం మావల మండల కేంద్ర సమీపంలోని జాతీయ రహదారిపై కన్పించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్